క్లుప్తంగా

జగన్‌ను కలసిన రమేష్‌రెడ్డి



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడిపత్రి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి కొనిదెల రమేష్‌రెడ్డి మంగళవారం ఇడుపులపాయలో కలిశారు. ఈ సందర్భంగా తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ నాయకులపై జరుగుతున్న దాడులు, రాజకీయ పరిస్థితులపై వివరించినట్లు ఆయన తెలిపారు.

మహమ్మద్ రఫీ శత జయంతి



మహమ్మద్ రఫీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక అంజుమన్ రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం మహమ్మద్ రఫీ శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పాడిన పాటలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాముడు, చలపతి, రామాంజినేయులు, బీసీ రామక్రిష్ణ, వీరయ్య, దివాకర్‌శాస్త్రి, క్రిష్ణయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పప్పుశనగ రైతులకు పరిహారమివ్వాలి

యాడికి: తుపాను వర్షాల వల్ల పుప్పశనగ పంటలో పూత, పులుపు పోయాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకటరాముడు యాదవ్. సీపీఐ నాయకులు తెలిపారు. మంగళవారం మండలంలోని ఎస్.కొత్తపల్లిలో రైతులు సాగు చేసిన పప్పుశనగ పంటను వారు పరిశీలించారు. రైతులు పప్పుశనగ పంటకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకూ పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని, పలు గ్రామాల్లో ఎండిన పప్పుశనగ పంటను తొలగిస్తున్నారన్నారు. పంటకు సోకిన తెగుళ్లకు మందును పిచికారీ చేసినా.. తెగుళ్ల పోలేదని రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, ఓబిరెడ్డి, శ్రీరాములు, వడ్డె రాముడు, చిన్న కుళ్లాయి రెడ్డి, నారాయణ స్వామి, కిరణ; శ్రీనివాసులు, మారుతి నాయుడు, రమేష్ నాయుడు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఒత్తిడితో ఐదుగురిపై కేసు

గుంతకల్లు రూరల్: టీడీపీ నాయకుల ఒత్తిడితో ఐదుగురు వైఎస్సార్ సీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గుంతకల్లు మండల పరిధిలోని చింతలాంపల్లిలో ఇరువర్గాల నడుమ స్థల వివాదం నడుస్తోంది. ఇదిలాఉంటే, గుంతకల్లు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త శివ తన స్నేహితులతో కలిసి చింతలాంపల్లిలో మల్లన్న తాత సమాధిని దర్శించుకునేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లారు. దర్శనానంతరం గ్రామంలో పరిచయం ఉన్న కొంతమంది వైఎస్సార్ సీపీ నేతలను మాట్లాడిస్తూ వచ్చారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రూరల్ పోలీసులకు వెంటనే ఫోన్ చేసి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జయరాముడు, బండయ్య, బొజ్జన్న, వన్నూరప్ప, ఉదయ్ కుమార్‌లు గ్రామంలో గొడవ చేసేందుకు గుంతకల్లు నుంచి మనుషులను పిలిపించారంటూ ఫిర్యాదు చేశారు.
దీంతో గ్రామానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి అక్కడకు చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. గొడవ పడొద్దని, ప్రశాంతంగా సమస్యను పరిష్కరించుకోవాలని చెప్పి వెళ్లిపోయారు. అయినప్పటికీ తగ్గని టీడీపీ నాయకులు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలజడులు సృష్టిస్తున్నారని, వారిపై కేసు నమోదు చేయాల్సిందేనని పట్టుబట్టడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

'నూర్ బాషా' సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా షాషావలి



వలిగడ్డి షాషావలిని సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: నూర్ బాషా ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గుత్తికి చెందిన షాషావలి ఎంపికయ్యారు. ఈ మేరకు నూర్ బాషా ముస్లిమ్ మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాజీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని షాషావలిని నూర్ బాషా సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు, సన్నిహితులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడు మాట్లాడుతూ దూదేకుల కులస్తుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా?



• రెవెన్యూ సదస్సుల్లో భారీగా అర్జీలు • నిబంధనలు పాటించని అధికారులు



• ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు తాతిరెడ్డి. ఈ రైతుకు మర్తాడు గ్రామంలో 4.86 ఎకరాల రిజిస్ట్రేషన్ భూమి ఉంది. ప్రస్తుతం కంది పంట సాగు చేశాడు. భూమి ఆన్‌లైన్‌లో కూడా 4.86 ఎకరాలు ఉంది. గతంలో సర్వే చేయించగా 3.60 ఎకరాల భూమి మాత్రమే ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. దాదాపు 1.26 ఎకరాల భూమి తక్కువగా ఉంది. అధికారులు తన భూమి తక్కువగా చూపుతున్నారని, భూమి సర్వే చేసి హద్దులు చూపించాలని పదుల సంఖ్యలో రెవెన్యూ అధికారులకు అర్జీలు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. భూ సమస్య పరిష్కరించాలని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ఇంతవరకూ సమస్య పరిష్కారం కాలేదు.



కొప్పలకొండలో రెవెన్యూ సదస్సు నిర్వహించిన అధికారులు (ఫైల్)

గార్లదిన్నె: భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. అర్జీలకు సంబంధించి భూ సమస్యలను అధికారులు ఏ మేరకు పరిష్కారం చేస్తారన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకం గా మారింది. అలాగే ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కూడా భూ సమస్యలపైనే అధిక సంఖ్యలో అర్జీలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇదే సమస్య నెలకొంది. ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించింది. ఆయా రెవెన్యూ గ్రామాల్లో కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు రెవెన్యూ సదస్సుల్లో పాల్గొనగా మిగిలిన గ్రామాల్లో అధికారులే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే అధికార పార్టీ నాయకులు ఎవరూ వాటిపై శ్రద్ధ చూపడం లేదనే చర్చ సాగుతోంది. రెవెన్యూ సదస్సుల్లో గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలపై అర్జీలు వస్తున్నాయి. గార్లదిన్నెలో 18, బుక్కరాయసముద్రంలో 14, శింగనమల 22, నార్పల 12, పుట్లూరు 17, యల్లనూరు 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటి వరకూ అధికారులు 55 గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు.

619 అర్జీలు పెండింగ్

ఈ నెల 24 వరకూ నియోజకవర్గవ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 1,050 అర్జీలు రాగా 619 అర్జీలు పెండింగ్ ఉన్నాయి. వాటిలో కొన్ని మాత్రమే అధికారులు పరిష్కరించారు. మిగతావన్నీ విచారణ చేసి పరిష్కారం చూపాల్సి ఉంది. కేవలం గ్రామ సభలు నిర్వహించి అర్జీలు తీసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వెళ్లి వాటిని పరిశీలన చేయాలి. అలాగే భూ సర్వే సమయంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి. అదేవిధంగా భూమి సరిహద్దులు, అసైన్ భూము లు, ఆక్రమణలు, సర్వే నంబర్ల తారుమారు, మరికొంత మంది సాగులో ఒకరు.. ఆన్‌లైన్‌లో ఇంకొకరు ఉన్నటువంటి సమస్యలు ఉన్నాయి. మార్కెట్‌లో భూముల విలువ పెరగడంతో పైరవీలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. పేద రైతుల భూములు కొందరు అక్రమార్కులు కాజేస్తుండడంతో బాధితులకు న్యాయం జరగడం లేదు. గ్రామాల్లో ఎప్పటి నుంచో భూ సమస్యలు ఉన్నా పదుల సంఖ్యలో మాత్రమే ప్రతి వారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇస్తున్నారు. వీటి పరిష్కారం దిశగా అధికారులు దృష్టి సారించాలి. కానీ అధికారులు కేవలం రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు మాత్రమే స్వీకరిస్తూ.. పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

శింగనమల నియోజకవర్గంలో ఇలా..

మండలం	పెండింగ్ అర్జీలు
శింగనమల	180
నార్పల	165
పుట్లూరు	108
బుక్కరాయసముద్రం	75
గార్లదిన్నె	69
యల్లనూరు	22

అర్జీదారులకు రసీదు ఇవ్వాలి



ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి. ప్రజలు రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చిన వారికి రసీదు ఇవ్వాలి. కానీ ఎక్కడా రెవెన్యూ సదస్సుల్లో అర్జీలకు రసీదు ఇవ్వలేదు. అధికారులు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి. జాయింట్ ఎల్‌పీ నంబర్ ఉన్న భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి. భూ రికార్డు మేరకు ఆన్‌లైన్‌లో ఉన్నవారికి భూమి చెందేలా న్యాయం చేయాలి.
– అక్బర్, రైతుసంఘం, జిల్లా ప్రధాన కార్యదర్శి

వేగవంతంగా పరిష్కరిస్తాం



మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఇప్పటి వరకూ 7 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించాం. రైతులు రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీలు రికార్డు చేసి, చిన్న సమస్యలైతే అక్కడే పరిష్కరిస్తున్నాం. భూ వివాదాలు, కోర్టు కేసులు ఉన్న వాటిని కోర్టు ఉత్తర్వులు మేరకు పరిష్కరిస్తాం. భూ వివాదాలు ఉన్న వాటిలో రికార్డులు చూసి, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి 45 రోజుల్లో బాధితులకు న్యాయం చేస్తాం.
– ఈరమ్మ, తహసీల్దార్, గార్లదిన్నె

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

గుంతకల్లు రూరల్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రమాదేవి సూచించారు. మంగళవారం మండలంలోని కొంగనపల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా 11 అర్జీలను అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు



వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్: గుంతకల్లు నియోజకవర్గంలోని క్రైస్తవులందరికీ మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మంగళవారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆ శాంతిదూత జన్మదినమైన క్రిస్మస్ పర్వదినాన్ని ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

నూతన చర్చి ప్రారంభం



చర్చిని ప్రారంభిస్తున్న పాస్టర్లు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న వైఎస్సార్ కాలనీలో పాస్టర్ వైపీ బాబు నూతనంగా నిర్మించిన లార్డ్ జీసస్ చర్చి–2 ను మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. అనంతపురానికి చెందిన పాస్టర్లు మార్క్, జహంగీర్, మనీషా, గుత్తికి చెందిన పాస్టర్లు వాసు అనిల్ కాంత్, జయపాల్, జాకోబ్, సాల్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, కౌన్సిలర్ కేవీ రమణ రిబ్బన్ కత్తిరించి చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినానికి ఒక రోజు ముందు చర్చిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దైవ జనులు ప్రతి ఆదివారం ఇక్కడికి వచ్చి ప్రార్థనలు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జీపు రమణ, మధు, వెంకటరాముడు, లక్ష్మిరెడ్డి, కౌన్సిలర్ నరేష్, పాస్టర్లు, దైవ జనులు పాల్గొన్నారు.

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి



కసాపురం అంగన్‌వాడీ సెంటర్లో వీర బాల దివస్, క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి సూచించారు. మంగళవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల అంగన్‌వాడీ సెంటర్లలోనూ వీర బాల దివస్ కార్యక్రమంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ రకాల వేషధారణలో ఆకట్టుకున్నారు.

కరెంట్ చార్జీల బాదుడుపై పోరుబాట



గుంతకల్లులో పోరుబాట పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి



శింగనమలలో పోస్టర్లను విడుదల చేస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు తదితరులు

గుంతకల్లుటౌన్/శింగనమల: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కరెంట్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పోరుబాట కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. విద్యుత్ చార్జీలను పెంచబోనని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక ప్రజలపై రూ.15,483 కోట్ల భారాన్ని మోపడం సిగ్గుచేటన్నారు. విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 27న ఉదయం టీవీ స్టేషన్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ట్రాన్స్‌కో కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు నీలావతి, కుమారి, సుమోబాషా, కోఆప్షన్‌సభ్యులు ఫ్లయింగ్‌మాబు, నూర్‌నిజామి, పార్టీ ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, వార్డు ఇన్‌చార్జ్‌లు వీరేష్, నాయుడు, పార్టీ సీనియర్ నేతలు భీమలింగప్ప, తిక్కస్వామి, ఇస్మాయిల్, జయరామిరెడ్డి, సోమిరెడ్డి, బావన్న, మౌలా, ఖలీల్, ఆర్‌డీజీ బాషా, హుసేన్, అంజి, బాసిద్, షాబుద్దీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

• కరెంటు చార్జీల పెంపును నిరసిస్తూ మంగళవారం శింగనమలలో పోరుబాటకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పిలుపు మేరకు ఈనెల 27న చేపట్టే పోరుబాటను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, సర్పంచ్‌లు వెంకటరాముడు, శంకర్‌రెడ్డి, గోపాలురెడ్డి, ఎస్‌పీ నారాయణరెడ్డి, నవీన్ కుమార్, రామాంజనేయులు, నాగన్న, నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుంతకల్లు రూరల్: స్థానిక భీమిరెడ్డి కాలనీలో నివాసముంటున్న ప్రైవేటు స్కూల్ టీచర్ మహమ్మద్ ఇంట్లోకి సోమవారం రాత్రి దుండగులు చొరబడి విలువైన బంగారు నగలు, వెండి సామగ్రిని అపహరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను సోమవారం కథల వీధిలో నివాసముంటున్న అత్తగారింటికి పిలుచుకెళ్లాడు. ఈ క్రమంలో తాళం వేసిన ఇంటిని గుర్తించిన దుండగులు... అర్ధరాత్రి దాటిన తర్వాత లోపలకు చొరబడి బీరువాలో ఉన్న 2.5 తులాల బంగారు నెక్లెస్, కిలో వెండి సామగ్రిని అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన మహమ్మద్ తాళాలు బద్దలుగొట్టిన విషయం గుర్తించి లోపలకు వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ట

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రైల్వే గ్రౌండ్ వద్ద ఉన్న లక్ష్మీ గణేశ దేవాలయంలో గురువారం తెల్లవారుజామున యంత్ర ప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ గుప్త, లక్ష్మీనారాయణ గుప్త మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతి స్వామి వారిచే ఉదయం 11:15 గంటలకు మహాకుంభాభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

27న సర్వసభ్య సమావేశం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాల్మాన్ మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

27న సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ట

పుట్లూరు: మండలంలోని చెర్లోపల్లిలో ఈ నెల 27న దద్దనాల సుంకులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం చేపట్టనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల ముస్తాబు





గుంతకల్లులో విద్యుద్దీప కాంతులతో మేరీమాత (ఆర్‌సీఎం) చర్చి , ఎస్‌పీజీ (గంట) చర్చి



సీఎస్ఐ చర్చి

గుంతకల్లుటౌన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని ప్రార్థనా మందిరాలు (చర్చీలు) సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆర్‌సీఎం మేరీమాత చర్చి, ఎస్‌పీజీ చర్చి, సీఎస్ఐ చర్చీలతో పాటు ఇతర ప్రార్థనా మందిరాలు విద్యుద్దీప కాంతులతో దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. చర్చీల వద్ద భారీగా ఏర్పాటు చేసిన స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలు ఆకట్టుకుంటున్నాయి. ఏసుక్రీస్తు సన్నిధిలో ప్రార్థనలు నిర్వహించేందుకు క్రైస్తవులు సన్నద్ధమయ్యారు. గాంధీ చౌక్‌లోని స్టార్‌లు, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ బొమ్మల విక్రయ కేంద్రాలతో పాటు దుకాణాల వద్ద సందడి నెలకొంది.

పామిడి: క్రైస్తవులు బుధవారం భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగను ఆచరించనున్నారు. ఈ సందర్భంగా స్థానిక సీఎస్ఐ చర్చిని సుందరంగా తీర్చిదిద్దారు. చర్చిని పూలు, విద్యుత్ ద్దీపాలతో అలంకరించారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకొని పామిడిలో మంగళవారం రాత్రంతా చర్చి సభ్యులు, యువత క్యారెల్ పార్టీ నిర్వహించారు. ఈసందర్భంగా క్యారెల్ పార్టీ ప్రతినిధులు సంఘసభ్యుల కుటుంబాలను సందర్శించి వారి కుటుంబాల్లో క్రిస్మస్ ఆనందాలను నింపారు. సోమవారం ఉదయం చర్చిలలో క్రైస్తవులు క్రిస్మస్ ఆరాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించి, ప్రత్యేక పార్థనలతో ఆనందోత్సాహాల నడుమ క్రిస్మస్ పండుగ చేసుకోనున్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో లార్డ్ జీసస్ చర్చిలో పాస్టర్ వైపీ బాబు ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం సుమారు 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు వైపీ బాబు, మార్క్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏసయ్యపై విశ్వాసం కలిగి ఉండాలన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకల సందర్భంగా ఆయా గ్రామాల్లో మంగళవారం క్రైస్తవులు చర్చీలు ముస్తాబు చేశారు. ఇప్పటికే పలు చర్చిలల్లో క్రిస్మస్ సంబరాలు, ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.



విద్యుద్దీపాలంకరణలో పామిడి సీఎస్ఐ చర్చి



గుత్తిలో మాట్లాడుతున్న పాస్టర్ వైపీ బాబు



గుత్తిలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జీవనోపాధులపై అవగాహన అవసరం



సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: యువతకు జీవనోపాధులపై అవగాహన ఎంతో అవసరమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ×ఆత్మ¤ సౌజన్యంతో వారం రోజులుగా నిర్వహిస్తున్న పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకున్న యువతీ యువకులకు ఏదో ఒక రంగంలో మెలకువలు అవసరం అన్నారు. స్వయం ఉపాధి కల్పనకు పుట్ట గొడుగుల పెంపకం ఉపయోగ పడుతుందన్నారు. ఆత్మ పీడీ మద్దిలేటి మాట్లాడుతూ యువతకు జీవనోపాధులు పెంపొందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం యువతకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి కేవీకే సిబ్బంది, యువతీ యువకులు పాల్గొన్నారు.